సమస్యల వలయంలో ఖుద్దూస్ నగర్

- కాలువపై సిమెంట్ బండలు లేకపోవడంతో అవస్థలు పడుతున్న స్థానికులు
- అంతేకాకుండా కాలువలో పేరుకుపోయిన మురుగు
- చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు

నగరంలోని ఖుద్దూస్‌నగర్‌లో పంట కాలువలు, సైడు కాలువలపై పలుచోట్ల సిమెంట్ బండలు, రక్షణ గోడలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా ఆయా కాలువల్లో చెత్తాచెదారం చేరడంతో మురుగు నీరు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతోంది.



ఖుద్దూస్‌నగర్ కాలువ వెంబడి ప్రమాదభరితంగా ప్రయాణిస్తున్న వాహనదారుడు



పంట కాలువకు రక్షణ గోడలు కూలిపోవడంతో పాటు పేరుకుపోయిన మురుగు

నెల్లూరు(బారకాసు): నగరంలోని 42వ డివిజన్ ఖుద్దూస్‌నగర్‌లోని పంటకాలువ పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఇక్కడి ప్రాంతంలోని పంటకాలువ(గచ్చుకాలువ) దుస్థితి అంతా ఇంతా కాదు. ఈకాలువపై సిమెంట్ బండలు లేకపోవడంతో ప్రమాదాలకు దారితీస్తోంది. కాలువకు ఇరువైపులా నివాసాలు ఉండటంతో స్థానికులు కాలువపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే పలుచోట్ల సిమెంట్ బండలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళన స్థానికుల్లో నెలకొంది. మరీ ముఖ్యంగా చిన్నపిల్లలు స్కూల్ వదిలిన సమయంలో, సెలవుల సమయంలో కాలువలో పడిపోతారోనన్న భయం తల్లితండ్రుల్లో నెలకొంది. గత ఏడాది కాలంగా ఖుద్దూస్‌నగర్‌లోని పంట కాలువ పరిస్థితిని పట్టించుకున్న దాఖలాలు లేవు. పలుమార్లు స్థానికులు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినా నేటికీ చర్యలు చేపట్టలేదు.

పారని మురుగు

ఖుద్దూస్‌నగర్‌లోని పంటకాలువలో చాలా కాలంగా సిల్ట్, చెత్తా చెదారం తొలగించిన పాపాన పోలేదు. ఫలితంగా కాలువలో మురుగు నీరు నిల్వ చేరుతోంది దుర్గంధం వెదజల్లుతోంది. దీనవల్ల దోమలకు ఆవాసాలుగా మారడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఖుద్దూస్‌నగర్‌లోని పంటకాలువపై ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.





కాలువ వెంబడి ఇలా..

హడలిపోతున్నాం



ఖుద్దూస్‌నగర్‌లోని పంట కాలువపై నడవాలంటేనే స్థానికులు హడలిపోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఇక రాత్రిపూట ఈ ప్రాంతంలో రాకపోకలు మరింత ప్రమాదకరం. కార్పొరేషన్ అధికారులు స్పందించి రాకపోకలు సాగించేందుకు కాలువపై సిమెంట్ బండలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలి.

– రఫీ, నవాబుపేట

సిమెంట్ బండలు ఏర్పాటు చేయాలి



ఇక్కడ పంట కాలువపై సిమెంట్ బండలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్నారులు ఎక్కడ కాలువలో పడిపోతారోనన్న భయం నెలకొంది. కాలువపై రాకపోకలు సాగించాలంటేనే హడలిపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి కాలువపై సిమెంట్ బండలు ఏర్పాటు చేయాలి.

– ఖాలీద్, ఖుద్దూస్‌నగర్ వాసి

క్లుప్తంగా

గంధ మహోత్సవానికి ఆహ్వానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఈనెల 20వ తేదీ జరుగనున్న మొహిద్దీన్ షావలి దర్గా గంధ మహోత్సవానికి హాజరు కావాలని వైఎస్సార్‌సీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని దర్గా పీఠాధిపతి షబ్బీర్ ముర్షిద్, 52వ డివిజన్ ఇన్‌చార్జి మహబూబ్‌బాషా, కో–ఆర్డినేటర్ కందుకూరి రమేష్ ఆహ్వానించారు. ఈ మేరకు సిటీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్సీని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. వారి వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

నేత్రపర్వంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం



నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేట జల కన్య బొమ్మ సెంటర్ దగ్గర ఉన్న కేవీఆర్ గ్రాండ్ మినీ ఫంక్షన్ హాల్లో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫంక్షన్ హాల్ అధినేత పొన్నాల అఖిలేష్‌రెడ్డి మాట్లాడుతూ స్టోన్‌హౌస్‌పేట ప్రాంతంలోని పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని దీనిని ఏర్పాటు చేశామన్నారు. ఈ ఫంక్షన్ హాల్‌ను స్టోన్‌హౌస్‌పేట ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళలకు వ్యాసరచన పోటీలు



నెల్లూరు(బారకాసు): నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న వికాస్ హైస్కూల్‌లో 'పరిసరాల పరిశుభ్రత' అనే అంశంపై మహిళలకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి వచ్చే ఆదివారం బహుమతుల ప్రదానం ఉంటుందని డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

సూపర్ సిక్స్‌ను విస్మరించిన సర్కార్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి సర్కార్ పూర్తిగా విస్మరించిందని ఏఐసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఏపీ ఇన్‌చార్జి గణేష్‌కుమార్ యాదవ్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ ఆరోపించారు. నగరంలోని ఇందిరాభవన్‌లో డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత యూపీఏ ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చిందని, కానీ బీజేపీ ప్రభుత్వం ఆ చట్టాన్ని తీసివేసే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను దగా చేసిందని, శాంతిభద్రతలను గాలికి వదిలేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వంపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నిలవాలని కోరారు. ఈనెల 15వ తేదీలోగా ఓట్ చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. అనంతరం నగరంలోని 42వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగరాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, అల్లాభక్షు, సంజయ్‌కుమార్, సుధీర్, రెహమాన్, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంతో రెండిళ్ల దగ్ధం



ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని బ్రహ్మదేవం పంచాయతీ పరిధిలో గల ఎస్టీ కాలనీలో అగ్నిప్రమాదం ఆదివారం సంభవించింది. వివరాలు.. సబ్‌స్టేషన్ ఎదురుగా గుడిసెలు వేసుకొని గిరిజనులు నివసిస్తున్నారు. ఈ తరుణంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. గ్యాస్ సిలిండర్ పేలింది. పద్మ, ముసునూరు రమణమ్మ ఇళ్లు పూర్తిగా దగ్ధం కావడంతో వారు సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. బాధితులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పరామర్శించి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు వెంకటసుబ్బయ్య, బషీర్, సాయి, మణి తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 5 నుంచి మహాకార్తీక దీపోత్సవం



సింహపురి కార్తీక దీపోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

నెల్లూరు(బృందావనం): స్వర్ణాలచెరువు గణేష్ ఘాట్ వద్ద నవంబర్ 5, 6, 7 తేదీల్లో మహాకార్తీక దీపోత్సవం జరుగనుందని సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు డాక్టర్ కె.వెన్నెల తెలిపారు. రామ్మూర్తినగర్‌లోని ఎన్నార్ ఫంక్షన్ హాల్లో దీపోత్సవ వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరులో నిర్వహిస్తున్న మహాకార్తీక దీపోత్సవం ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో పేరు ప్రతిష్టలు గడించిందన్నారు. సమితి కార్యదర్శి బయ్యా మల్లిక, ఉపాధ్యక్షురాలు కోడూరు జయప్రద, కార్యనిర్వాహక అధ్యక్షుడు కోడూరు జయరామ్, కార్యదర్శి ముక్కాల వ్యాస ప్రసాద్, శ్రీకంఠం రమణయ్య, బాలసుబ్బారావు, రమేష్, ఏవీఆర్ మోహన్‌రావు, పి.సురేందర్‌రెడ్డి, కిశోర్, హర్షవర్ధన్, శ్రీనివాసులు, రంగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

పెంచలరావుకు కన్నీటి నివాళి



పెంచలరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

నెల్లూరు(అర్బన్): చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు(50) భౌతిక కాయానికి పలువురు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు కన్నీటి నివాళులర్పించారు. ఆయన భౌతిక కాయాన్ని అధికారులు, ఉద్యోగుల సందర్శనార్థం స్థానిక దర్గామిట్టలోని ఎన్‌జీఓ భవన్‌లో ఆదివారం ఉంచారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాతతో పాటు అసోసియేషన్ నాయకులు లక్కాకుల పెంచలయ్య, కార్యదర్శి రామకృష్ణ, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, చొప్పా రవీంద్రబాబు, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్కాకుల పెంచలయ్య, చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ వైద్యశాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్న మన్నేపల్లి పెంచలరావు వివాద రహితుడన్నారు. పీఆర్సీని అమలు చేయాలని, డీఏ బకాయిలు విడుదల చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలనే డిమాండ్లతో అన్ని సంఘాలను కలుపుకుని పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఆయన లేనిలోటు తీరని నష్టం అన్నారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతిని ప్రకటించారు.

సానుభూతి తెలపని ప్రజాప్రతినిధులు

కాగా ఉద్యమనేత మన్నేపల్లి పెంచలరావు మృతదేహాన్ని జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులెవరూ సందర్శించలేదు. కుటుంబ సభ్యులను పరామర్శించలేదు. అలాగే కలెక్టర్ కూడా పట్టించుకోలేదని ఉద్యోగ వర్గాలు విమర్శిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగాయని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ అన్నారు. దళితులపై దాడులకు వ్యతిరేకంగా నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఆయన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ ఒక దళితుడు కాబట్టి ఆయనపై దాడికి యత్నం జరిగిందన్నారు. గతంలో సుప్రీంకోర్టు జస్టిస్‌లుగా పనిచేసిన వారిపై ఇలాంటి దాడులు జరగలేదని తెలిపారు. ఒక దళితజాతికి చెందిన జస్టిస్‌కు ఇలాంటి అవమానం జరగడం దళితులను కన్నీళ్లు పెట్టిస్తోందన్నారు. ఆంధ్రాకు చెందిన దళితుడు హరియాణాలో డీజీపీలో స్థాయి పోలీస్ అధికారిగా పనిచేస్తుంటే బీజేపీ ప్రభుత్వంలో తనకు జరిగిన అవమానం తట్టుకోలేక తుపాకీతో కాల్చుకుని చనిపోయారని తెలిపారు. హరియాణా ప్రభుత్వ వేధింపులే కారణమని తొమ్మిది పేజీల నోట్ రాశారని వివరించారు. బీజేపీ, కూటమి ప్రభుత్వంలో దళిత ఆఫీసర్లకు గౌరవ మర్యాదలు లేవని, ఉద్యోగస్తులను అవమానిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి పట్టపగలు నిప్పుపెట్టడం దారుణమన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు కారకులకు గుణపాఠాలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సమీవుల్లా, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏకు షోకాజ్ నోటీసులు

కొడవలూరు: మండలంలోని పాతవంగల్లు వీఆర్‌ఏ(గ్రామ సహాయకుడు) పెనమల్లి శ్రీనివాసులుకు తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీఆర్‌ఏ శ్రీనివాసులు గ్రామ వీఆర్వో సంతకం ఫోర్జరీ చేసి ఇంటి ధ్రువీకరణ పత్రం జారీ చేశారని బొంతలపాళెం గ్రామానికి చెందిన వడ్లమూడి నరేంద్ర తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన ఆమె వీఆర్‌ఏకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సంతకం ఫోర్జరీకి పాల్పడినందున చర్యలు ఎందుకు తీసుకోకూడదో సమాధానం చెప్పాలని అందులో కోరారు.

విద్యార్థులకు జిల్లా స్థాయి సెమినార్ రేపు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 14న వెంకటాచలం మండలం చెముడుగుంటలోని జిల్లా సైన్స్ సెంటర్‌లో ఉదయం 9 గంటలకు క్వాంటం ఏజ్ బిగిన్స్ పొటెన్షియల్స్ అండ్ చాలెంజ్ అనే అంశంపై జిల్లాస్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు డీఈఓ బాలాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్ అనంతరం రాత పరీక్ష, ప్రజెంటేషన్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 5 చార్టులు/స్లైడ్స్ ఉపయోగించుకుని ఆరు నిమిషాల పాటు ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. ఒక పాఠశాల నుంచి ఒక విద్యార్థి మాత్రమే పోటీలకు హాజరు కావాలన్నారు. అత్యుత్తమ ప్రదర్శన చూపిన ఇద్దరు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. వీరు ఈనెల 15న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అక్కడి విజేతలకు ఈనెల 30న బెంగళూరులో జాతీయస్థాయి సైన్స్ సెమినార్ జరుగుతుందన్నారు. కాగా పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలు ఈనెల 13వ తేదీలోపు జిల్లా సైన్స్ అధికారి 93471 21712 వాట్సప్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

నేత్రదానం

నెల్లూరు(అర్బన్): కలువాయి మండలంలోని తోపుగుంట గ్రామానికి చెందిన వింజం కొండయ్య(75), రత్నమ్మ(69) అనే దంపతులు శనివారం వారి గ్రామంలో మృతిచెందారు. ఈ క్రమంలో వారి కుమారులు బ్రహ్మానాయుడు, రామానాయుడు, నిరంజన్‌బాబులు తమ తల్లిదండ్రుల నేత్రాలను న్యాయవాది మక్కెన అంకయ్యచౌదరి సహకారంతో నెల్లూరు ప్రభుత్వ పెద్దాస్పత్రికి దానం చేశారు. దీంతో ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ మృతుల నేత్రాలను సేకరించి కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందించారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేయదలచిన వారు అంకయ్యచౌదరి(98492 82878), సునీల్ (99595 89321) నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

విద్యార్థులకు వివిధ రకాల పోటీలు

నెల్లూరు (టౌన్): ఈనెల 15న అబ్దుల్ కలామ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక విశ్వ సాయి ఎస్సార్కే పాఠశాలలో బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతులుగా సుందరి, రాజా, నిరజలు వ్యవహరించారు.

వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలి

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా వసతి గృహాలు లేవన్నారు. మెస్ చార్జీలు నెలకు రూ.1,600లు ఇస్తున్నారని, ఇది చాలా తక్కువన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు.

బైక్ దగ్ధంపై ఫిర్యాదు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తన ఇంటి ముందు నిలిపి ఉన్న బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారంటూ ఓ వ్యక్తి ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని కుమ్మరి వీధి ప్రాంతానికి చెందిన ఎండీ ఫిరోజ్‌ఖాన్ బంగారు పని చేసుకుంటూ జీవిస్తున్నారు. తన సీబీజెడ్ బైక్ పంక్చర్ కావడంతో గత 10 రోజుల నుంచి ఇంటి ముందు పార్క్ చేసి ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున 4.40 గంటలకు పక్కింటిలో ఉన్న నౌషాద్ అనే వ్యక్తి ఫిరోజ్‌ఖాన్‌కు ఫోన్ చేసి మీ ఇంటి ముందు ఉన్న బైక్ దగ్ధమవుతోందని చెప్పడంతో వెళ్లి నీటితో మంటలను ఆర్పివేశారు. అదేవిధంగా పక్క వీధిలో కూడా హోండా షైన్ అనే బైక్ కూడా దగ్ధమైనట్లు గుర్తించాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు తన బైక్‌ను తగులబెట్టినట్లు ఫిరోజ్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుప్పట్ల వితరణ

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరం యువసేవాదళ్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి మాట్లాడుతూ సాయిబాబా మహాసమాధి(ఆరాధన) మహోత్సవం సందర్భంగా నగరంలోని రంగనాయకులపేట నుంచి వేదాయపాళెం వరకు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ఫుట్‌పాత్‌లు తదితర ప్రాంతాలతో పాటు, జొన్నవాడ, గొలగమూడి, నరసింహకొండ ప్రాంతాల్లో ఉన్న యాచకులు, వృద్ధులు, నిరాశ్రయులకు 500కుపైగా దుప్పట్లను పంపిణీ చేసినట్లు వివరించారు.



వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 300 మంది వాకర్స్‌కు ఆదివారం బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. షుగర్ పరీక్షలకు సంబంధించి స్ట్రిప్స్‌ను అసోసియేషన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ మర్లపాటి హరిరావు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ చింతల అమరేంద్రరెడ్డి, గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, నేతలు స్వర్ణ రమేష్‌బాబు, సుబ్బరామిరెడ్డి, జయదేవ్, గఫార్, చంద్రమౌళి, ఆరి ప్రసాద్, డాక్టర్ అంకిరెడ్డి, సత్యనాథ్, కృష్ణమూర్తి, శ్రీధర్, కేఎంకే రెడ్డి, వెంకటేశ్వరరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఇరుకళల పరమేశ్వరికి బంగారు హారం బహూకరణ



నెల్లూరు(బృందావనం): సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి మునగల మహేష్‌రెడ్డి– కీర్తిరెడ్డి దంపతులు బంగారు నెక్లెస్ హారాన్ని ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ గిరికృష్ణ మాట్లాడుతూ 35 గ్రాముల బంగారు హారాన్ని దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్‌కు కుటుంబసభ్యులతో కలిసి అందజేశారన్నారు. వీరికి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, వేదాశీర్వచనాలతో తీర్థ ప్రసాదాలు అందజేశామన్నారు.

వైఎస్సార్‌సీపీలో ప్రతిఒక్కరికీ సముచిత స్థానం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి ప్రాధాన్యనిస్తూ ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని పార్టీ నగర సమన్వయకర్త, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం 52వ డివిజన్ ఇన్‌చార్జి మహబూబ్‌బాషా, కోఆర్డినేటర్ కందుకూరు రమేష్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన భక్షు, రహమత్, వారి సహచరులు పర్వతరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఏడాదిన్నర పాలనలోనే కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రజావ్యతిరేకతను మూటకట్టుకుందని, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. మళ్లీ రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని, ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు.

నూతన దుస్తుల పంపిణీ



నెల్లూరు(బృందావనం): దీపావళి పండగ సందర్భంగా వనంతోపు సెంటర్ దగ్గర ఉన్న జనహిత, వాత్సల్య ఆశ్రమంలో బాలలకు నూతన దుస్తులు, బాణసంచాను ఆదివారం పంపిణీ చేశారు. మొదట కేక్ కట్ చేసి, బాలలకు తినుబండారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవా బృందం సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. సమగ్రశిక్ష అభియాన్ ఏఎంఓ జి.సుధీర్‌బాబు, నెల్లూరు ఎంఈఓ ఆర్.మురళీధర్, వ్యాపారవేత్త దువ్వూరు నగేష్‌రెడ్డి, మానవసేవయే మాధవ సేవ టీమ్ నిర్వాహకులు ఎం.పరిమళ, ఆర్.ఇందిర, జీవీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్, ఆశ్రమ అధ్యక్ష, కార్యనిర్వాహక కార్యదర్శులు పి.రామదండు, జీవీ సాంబశివరావు, వ్యాపారవేత్త జేపీ జైన్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు.